# చిరంతన సత్యం వైపు...






రాఘవన్ సీతారామన్

# విశ్వ సమస్తం మనలోనే

**వాషింగ్టన్ కాలేజ్ లొ 229 ఆరంభంలొ న్యాయ శాస్త్రంలో గౌరవ డాక్టర్ పట్టా అందుకుంటున్న సందర్భంలో**
**డా. ఆర్. సీతారామన్ ప్రసంగం.**

ఈరోజు నేను ఈ స్థితికి చేరగలిగానంటే,  దానికి నేను పాటించిన కొన్ని జీవన సూత్రాలే మౌలిక కారణం. ఆ సూత్రాలు నాకు అందించిన కొన్ని ముఖ్యమైన సందేశాలను ఈరోజు నేను మీ అందరితోనూ మనస్పూర్తిగా పంచుకోవాలనుకుంటున్నాను. ఇప్పటివరకూ గడిచిన నా జీవితమంతా ఈ సూత్రాల మీదనే నిర్మితమైంది. వాటిలో కనీసం ఒకదాన్నయినా మీరు ఆచరించాలనుకుంటే,  నా ఈ ప్రసంగానికి సార్ధకత చేకూరినట్లే. నా జీవితం పదిమందికీ ప్రేరణాదాయకమనే గర్వోక్తికి నేను పాల్పడను. కానీ నా లక్ష్యాలను నేను మలుచుకున్న తీరు చూసి, మారుమూల పల్లెల్లో ఎలాంటి అవకాశాలూ లేకుండా నివసించే పిల్లలకి ప్రతికూల పరిస్థితుల్లో నిబ్బరంగా, ధైర్యంగా వ్యవహరించడం ఎలాగో తెలుసుకోవడానికి ఈ నాలుగు మాటలు ఉపయోగపడవచ్చునని అనుకుంటున్నాను.  తాము  వెనకబడిపోయామనీ, ఫలానా పని చేయలేమనీ లేనిపోయిన అశక్తతలని తమ వ్యక్తిత్వానికి  పొరబాటుగా ఆపాదించుకునే యువతని, వారి అపోహల నించి తప్పించి, సరైన మార్గం చూపడానికి నా ఈ ఆలోచనలు సహాయపడగలవని భావిస్తున్నాను. "నిన్ను నువ్వు తెలుసుకో" అంటూ మానవ జీవితానికి సార్ధకతని చేకూర్చే ఆత్మ జ్ఞానం ఈ విధంగానే సాధ్యపడుతుందని నమ్ముతున్నాను.



నేను జన్మించింది పేద కుటుంబంలోనే అయినా, ఉగ్గుపాలను ఉన్నతమైన విలువలతో రంగరించి పెంచిన  గొప్ప మేధోపరమైన కుటుంబం మాది. **సమస్త విశ్వం మనలోనే ఉంద**ని నమ్మేవాడిని నేను.  ఆ విశ్వమే మనకు సరైన జీవన దృక్పథాన్ని కలుగజేయడంలో సహాయ పడుతుంది, జీవితంలో సరైన దిశలో మన ప్రయాణం సాగేటట్లు చూస్తుంది. "మాత-పిత-గురు-దైవం" అనే ప్రబోధంతో తల్లిదండ్రులకీ, గురువులకీ అత్యున్నత స్థానమిచ్చి గౌరవించే ప్రాంతం నుంచి నేను మీ ఎదుటకి వచ్చాను.  మొదట తల్లిదండ్రులు, తర్వాత గురువులను పూజించిన తరువాతనే దైవాన్ని పూజించమని దాని భావం. మనలో ఉన్న సకల సామర్ధ్యాలనీ మనం నివసిస్తున్న సమాజానికీ మన తోటి మానవులకీ సహాయపడడానికి వినియోగించాలి.  మా తల్లిదండ్రులు మా పిల్లలందరికీ మా అంతట మేమే ఒక క్రమ శిక్షణ అలవర్చుకునేలా పెంచారు.  ఈ రోజు అత్యున్నత నైతిక ప్రమాణాలతో, ప్రపంచ స్థాయిలో పాలన నిర్వహిస్తున్నామన్నా,  మాకు చిన్నప్పుడు వేయబడిన ఆ పునాదే మౌలిక ఆధారం. మానవ అవసరాల పిరమిడ్ లో శిఖరాగ్ర స్థితిలో ఉన్న ఆత్మ జ్ఞాన స్థితిని చేరాలంటే,  మన జీవితకాలంలో మనం సంపాదించిన విలువలు, నిర్విరామ కృషితో కూడిన అనుభవాల ద్వారానే సాధ్యమవుతుంది. మన వ్యక్తిత్వం శిఖర స్థాయికి చేరిందంటే, దానికి ప్రాథమికంగా మన తల్లిదండ్రులే మనలో నింపిన గొప్ప విలువలే పునాది రాళ్లు.

## లక్ష్యాల నిర్ధారణ



మనిషి తన జీవితంలో చదువుపై పెట్టే పెట్టుబడే ఉన్నతమైన పెట్టుబడి. ఈ సంగతి నేను చిన్నప్పుడే గమనించాను. అందుకే, నేను మా ఇంటికి ౧౦ కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక మంచి పాఠశాలని ఎంచుకున్నాను. మా తండ్రిగారికి నెలకి ౭౫ రూపాయల ఆదాయం ఉండేది ఆ రోజుల్లో. ఆ ఆదాయంలో ౨౫ రు. నేను బడిలో చదువుకోవడం కోసమే వినియోగించేవారు. చదువు మీద పెట్టిన ఈ పెట్టుబడే నా జీవితంలోనూ, నా వృత్తిలోనూ అడుగడుగునా ఉపయోగపడింది. నేను నా పెట్టుబడిని శ్రద్ధగా, గౌరవంగా పెట్టడం నేర్చుకున్నాను. సరైన సమయంలో సరైన అంశాలపై పెట్టుబడి పెడితే, అది నీ భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు అందిస్తుందనే మౌలిక సూత్రం అర్థం చేసుకున్నాను. రాన్రానూ పెరుగుతూ పోయిన జీవన వ్యయం, నా చదువుకి మరింత ఎక్కువగా ఖర్చు పెట్టవలసి రావడం, ఇంకా తమ్ముళ్లు, చెల్లెళ్ల అవసరాల కోసం మరిన్ని ఖర్చులు మీదపడడంతో, ఆ పరిస్థితిని తట్టుకుని రావడానికి అమ్మ, నాన్న ఇంట్లో పడ్డ అవస్థలు చూశాను. అదే క్షణంలో చదువుకుని పైకి రావడమే నా తక్షణ కర్తవ్యమని నిర్ణయించుకున్నాను. నేనప్పుడు ౮ వ తరగతిలో ఉన్నాను. వ్యక్తిగతంగా నేను తీసుకున్న మొదటి సవాలు అదే. ముందుగా నేను మా పాఠశాల ప్రధానోపాధ్యాయుల దగ్గరికి వెళ్లి నా పరిస్థితి అంతా తెలియజేశాను. నేను ఆ సంవత్సరం పరీక్షలలో ప్రథముడిగా వస్తే, నేను ౯ వ తరగతి నుంచి ౧౧ వ తరగతి వరకూ ఉచితంగా చదువుకోవచ్చునని చెప్పారాయన. పైగా బట్టలు, హాస్టల్ సౌకర్యాలు కూడా ఉచితంగా లభిస్తాయని చెప్పారు. "అవసరమే కదా అన్ని ఆవిష్కరణలకీ మూలం!" నేను గొప్పగా చదువుకోవాలనీ, దాని ద్వారానే జీవితంలో మంచి కెరీర్ లోకి అడుగుపెట్టాలని బలంగా నిర్ణయించుకున్నాను. నేనెప్పుడూ కష్టపడి చదివేవాడిని. ఒక క్రమపద్ధతిని పాటించేవాడిని. దానితో నాకు నేనుగా ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకోవడానికి వీలు పడింది. నేను పెట్టుకున్న లక్ష్యాలను ఒక్కొక్కటిగా సాధించుకోవాలని నిర్ణయించుకున్నాను.

ఈ రోజు నేను దోహా బ్యాంకు సీఈఓగా కూడా మేం అప్పుడప్పుడూ కొన్ని లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తాం. "ఆలోచించినా, కలలు కన్నా అవి ఉన్నతంగానే ఉండాలి" అనేదే మీ జీవిత సిద్ధాంతం కావాలి. మీ జీవితంలో మీకు ఎన్ని విధాల ఉత్థాన పతనాలు చూడవలసి వచ్చినా, అలోచనే మీ ఆస్తి కావాలి.

## నిబద్ధత...నిశ్చయం : అంత దూరం పరిగెత్తిన బాలుడు





ఒక స్వప్నం కురచ దారుల్లో వాస్తవంగా మారదు. దానికి దృఢ నిశ్చయం కావాలి, చెమటోడ్చి కష్టపడాలి. ౮ వ తరగతిలో ఉండగా తరగతిలో అందరి కంటే ముందు ఉండడానికి నేను బాగా పని చేసేవాడిని. ఇదే నా జీవితాన్ని ముందుకు నడిపిస్తుందని నమ్మాను కాబట్టి, మరింత అంకితభావంతో, ఏకాగ్ర చిత్తంతో, ఒక పద్ధతిని అనుసరించి చదువుకునేవాడిని. నేను చేసే ఏ పనిలోనైనా ఈ విధమైన తీవ్రత, భావోద్వేగాలే ఆ పనిని దిగ్విజయంగా పూర్తయ్యేలా చేస్తాయి. నా గమ్యాన్ని చేరుకోవడంలో నిద్రలేని రాత్రులు పాత్ర ఎంత ఉందో! నా చివరి పరీక్ష గణితం. ఈ చివరి పరీక్ష బ్రహ్మాండంగా రాయాలని, విషయమంతా బాగా చూసుకున్నాను.

మామూలుగా రోజూ పాఠశాలకి వెళ్లే సమయం ప్రకారం ఉదయం ౮.౩౦ కి బస్ స్టాప్ కి వచ్చేశాను. నాకు ఆ పరీక్ష ఉదయం ౧౦ గంటల నించి మధ్యాహ్నం ౧ గంట వరకూ ౩ గంటల సేపు ఉంది. సమయం గడిచిపోతోంది. ఎంత సేపటికీ బస్ రాదు! నా మనసులో క్షణ క్షణానికీ పెరిగిపోతోంది. ౯ గంటలైనా బస్ రావడం లేదు. ఏం చేయాలో తెలియని అయోమయస్థితిలో పిచ్చెక్కి పోతోంది నాకు. ఇప్పుడు బడికి చేరుకునే మార్గమేమిటా అని ఆలోచిస్తే, వేరే ఏ రకమైన సౌకర్యాలూ లేవనే విషయం అప్పుడు గుర్తించాను. దాంతో ఇంటికి పరుగు తీసి, నా సైకిలు తీసుకుని, బలమంతా ఉపయోగించి తొక్కడం మొదలుపెట్టాను. చాలా బలంగా తొక్కుతూ వెడుతున్నానేమో… ౨ కిలోమీటర్లు దాటగానే, ఓ మారు మూల ప్రాంతంలో, దాని టైరు పగిలి పోయింది. అక్కడ నుంచి నా పరీక్ష హాలుకి నేను ౩౦ నిముషాల్లో చేరుకోవాలి. ఇక నా సైకిలుని నేను రోడ్డు ప్రక్కనే వదిలేసి, పరుగు పరుగు అందుకున్నాను. నా కాళ్లూ, చేతులూ దడదడలాడి పోతున్నాయి. కానీ నా మనసు దృఢంగా ఉంది. నేను ౮ కిలోమీటర్లూ పరిగెత్తుకుంటూనే వెళ్లాను. చివరికి నేను స్కూలుకి చేరుకున్నాను. అప్పటికే ౩౦ నిముషాలు ఆలస్యమైంది. మా హెడ్ మాస్టారుని కలిశాను. విషయమంతా చెప్పి, ఎన్నో విధాల బ్రతిమాలుకున్నాను. ఎలాగైతేనేం, చివరికి ఆయన పరీక్ష రాయడానికి ఒప్పుకున్నారు. శారీరకంగా అయితే నేను విపరీతంగా అలిసి పోయాను. కానీ నా మనసు చాలా బలంగా ఉంది. ఈ మానసిక బలమే ఆ రోజు నా పరీక్షని ౨ గంటల ౧౫ నిముషాల్లోనే పూర్తి చేసేట్టు చేసింది. నా ప్రణాళిక, నా సంసిద్ధత నాకు సహాయపడ్డాయి. ఆ రోజున ఏం జరిగిందా అని నేను వెనక్కి చూసుకుంటే…అది కేవలం నా చదువు, నేను పరీక్ష రాయడానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు, అంత కంటే చాలా చాలా ప్రధానమైన సంగతి ఒకటుంది… **వదిలిపెట్టక పోవడం**…మనం ౧౦౦ రకాల ఆటంకాలు ఎదుర్కోవచ్చు. కానీ మనసు మాత్రం మనం నిర్ధారించుకున్న లక్ష్యం మీదనే స్థిరంగా ఉండాలి. దాని కోసం చేసే ప్రయత్నమూ అలుపెరుగకుండా చేయాలి. అదీ అందులో నేను నేర్చుకున్న జీవిత పాఠం. ఆ క్షణాల గురించి నేను మళ్లీ ఒకసారి ఆలోచిస్తే, ***ఆ రోజు స్కూలుకి పరిగెత్తుకుంటూ వెళ్లాలనే నిర్ణయం తీసుకుంది నేనే.*** ఆ నిర్ణయమే ఎంతో క్లిష్ట పరిస్థితిలో నాకు సాధించిన విజయం సాధించి పెట్టింది. మనం గుర్తుంచుకోవాలి. ***మన చేతుల్లో లేని పరిస్థితులు, సవాళ్లూ కూడా మన దృఢ నిశ్చయంతో మనకు లొంగి తీరతాయని మనం గుర్తించాలి.***

ఇప్పుడు నేను దోహా బ్యాంకులో సీఈఓగా ఉన్నా, మా రోజు వారీ పనులు చాలా సక్రమంగా నిర్వర్తించుకుంటూ వెళ్లి పోతున్నా, బయటి పరిస్థితుల గురించి అప్రమత్తంగా ఉండాలి. ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల మేం అనుకోకుండా వచ్చే అవాంతర పరిస్థితుల్ని తేలిగ్గా అధిగమిస్తుంటాం. నేనిక్కడ చెప్పదలుచుకున్న అంశం ఒకటే… మనకి వైఫల్యం ఎదురైందంటే, అది నిరూపించే విషయం ఒకటే….మనం విజయవంతం కావాలని చేసుకునే నిశ్చయంలో ఎక్కడో లోపం ఉందన్నమాట. కాబట్టి, మనం నిశ్చయాత్మకంగా వ్యవహరించి, అంకిత భావంతో పట్టుదలగా ముందుకే ప్రయాణం సాగించినపుడు, మన లక్ష్యం దానికదే చేరువవుతుంది.

## జ్ఞాన సంపద

## కఠోర పరిశ్రమ ప్రాధాన్యత



ఆ సంవత్సరం మా తరగతిలో నేనే ప్రథముడిగా నెగ్గడంతో, ఆ తర్వాత ౩ ఏళ్లపాటూ వరసగా నేను ఉచితంగా చదువుకోగలిగాను. ఎక్కువగా మనం కష్టపడి పనిచేయడానికి ఇష్టపడం, తప్పించుకుని తిరుగుతాం, కానీ మనం మన లక్ష్యాన్ని చేరుకోవడంలో చూపించే అచంచలమైన దీక్ష, ఇష్టం, అంకితభావంతో పనిచేసే లక్షణమే మనం ఏ రంగంలో ఉన్నా విలక్షణంగా, ప్రత్యేకంగా కనబడేట్టు చేస్తుంది. నేను ౯ వ తరగతిలోకి వచ్చాక, నా అవసరాల కోసం పార్ట్ టైంగా పని చేయడం మొదలు పెట్టాను. ఆ రోజుల్లో వారానికి ౯ రూపాయల సంపాదన నాది. దానిలో అమ్మకు ఇంటి ఖర్చుల కోసం ౮ రూపాయలు ఇచ్చేసి, వారాంతంలో మా ఇంటికి వెళ్లడానికి నా దగ్గర ౧ రూపాయి ఉంచుకునేవాణ్ణి. ౯ వ తరగతిలో ఉండగానే నేను ౧౧ వ తరగతి విద్యార్థులకి ట్యూషన్ పాఠాలు చెప్తుండేవాడిని. దీనివల్ల నాకు ౨ ప్రయోజనాలు కనిపించాయి. ఒకటి ఇలా చెప్తుండడం వల్ల జ్ఞానం అభివృద్ధి చెందడం. రెండవది, నేను చదువుకునేందుకు వారి దగ్గర నుంచి నాకు ఉచితంగా పుస్తకాలు లభించడం.

ఇప్పుడు మనందరికీ సుపరిచితమైన నాలెడ్జ్ షేరింగ్ సెషన్స్ (పరస్పర జ్ఞాన వినిమయ సమావేశాలు) ని దోహా బ్యాంకులో ఏర్పాటు చేయడానికి నాకు ఈ విధమైన పునాది రాళ్లే మౌలిక ఆధారంగా నిలిచాయి. దోహా బ్యాంకు లక్ష్యాలు సాధించేందుకు, జ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం, కఠోర పరిశ్రమ చేయడం అనే తాత్విక సిద్ధాంతాలతో పని చేస్తున్నాం. ఈ రోజుకీ నేను సంస్థ కోసం ౧౦-౧౨ గంటలు కష్టపడతాను.
మీడియా, నా ఉద్యోగులు, ఇంకా బ్యాంకుకి సంబంధించిన ఇతర భాగస్వాములందరికీ నాలెడ్జ్ షేరింగ్ సెషన్ల విషయమై నేను చూపే చొరవ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. కఠోర పరిశ్రమ నించి పొందే పరిపూర్ణత, సంతృప్తి తప్పకుండా సంతోషాన్ని కలిగిస్తుంది.

## సహానుభూతి



తోటి వారి అవసరాల పట్ల, బాధ పట్ల సహానుభూతి గల వ్యక్తి, వారి కష్టాలకు బాసటగా నిలవాలనే ఆలోచన ఉండడం వల్ల తన ఆలోచనని తన కోసమే పరిమితం చేసుకోక, తన పరిధిని మరింత విశాలం చేసుకుంటూ ముందుకు సాగుతాడు. దీనికి నా జీవితం నుంచే ఒక ఉదాహరణ : అప్పుడు నేను పట్టణంలో సూపర్ మార్కెట్ లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తుండేవాడిని. అమ్మ వాళ్లు మా ఊళ్లో ఉండేవారు. నేను జాగ్రత్త చేసే ౮ రూపాయలతో, నేను ఇంటికి కావలసిన మంచి వస్తువులు కొనాలని చూసేవాడిని. ఒకసారి మా కుటుంబానికి, వంటలో ఇంధనంగా ఉపయోగించడానికి ౨ కిరసనాయిల్ టిన్నులు కావలసి వచ్చాయి.

ఇంటికి వచ్చినపుడు, నేనా పరిస్థితిని గమనించి, వచ్చే వారంలో ఆ టిన్నులు తెస్తానని నేను అమ్మకి మాట ఇచ్చాను. నేను సూపర్ మార్కెట్ కి వెళ్లాను. అక్కడ వాటి ధర చూశాను. ఒక్కో టిన్ను ధర ౪.౨౫ రూపాయలు. పైగా అదనంగా, ఆ కిరసనాయిల్ టిన్నులు బాగా బరువుగా ఉన్నాయి కాబట్టి, ఇంటికి తీసుకుని రావడానికి రవాణా సౌకర్యం ఏదైనా కావాలి. రెండు టిన్నులూ ౧౦ కేజీల దాకా ఉంటాయి. ఇల్లు చూస్తే ౧౦ కిలోమీటర్ల దూరంలో ఉంది. మా కుటుంబానికి కిరసనాయిలు తేవడం చాలా అవసరమని నాకు తెలుసు. దానితో నేను మళ్లీ ఒకసారి ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి మనసుని సంసిద్ధం చేసుకున్నాను. ఇక నేను ఆ ౨ కిరసనాయిల్ టిన్నులూ కొనుక్కుని, ఇంటికి బయల్దేరాను. ఇంటికి చేరడానికి నాకు ౩.౨౫ గంటలు పట్టింది. మా కుటుంబ సభ్యుల పట్ల నాకు గల ప్రేమాభిమానాలే అంత దూరం, అంత బరువు మోసుకుంటూ నేను ఇంటికి వెళ్లేలా చేశాయి. ఆ తర్వాత నేను భోజనం దగ్గర కూడా సరిగా కూర్చోలేక పోయాను, నా చేతులన్నీ బొబ్బలెక్కిపోయాయి. కానీ నేను అమ్మకి ఇచ్చిన మాట నిలబెట్టుకోగలిగినందుకు నా హృదయంలో సంతోషం ఉప్పొంగుతోంది. మన కుటుంబ సభ్యుల బాధలను అర్థం చేసుకోవడం నుంచే తోటివారి పట్ల సహానుభూతి ఎలా కలిగి ఉండాలో అర్థమవుతుంది. వారి కష్టం మనం పంచుకున్నప్పుడు, వారికి సహాయం చేయడానికి ప్రయత్నం చేసినపుడు, అది కుటుంబానికి సానుకూల శక్తిని ప్రసాదిస్తుంది.

నేను పనిచేస్తున్న పరిశ్రమలో ఈ విధమైన సహానుభూతి కలిగి ఉండడం వల్లనే గతంలో తోటి ఉద్యోగస్థుల మనోభావాలను గమనించడం జరిగింది. ఇప్పుడైనా గానీ, నేనిచ్చిన మాటను మనస్ఫూర్తిగా, నిజాయితీగా నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తాను. దోహా బ్యాంకులో మేం పరస్పరం గౌరవించుకోవడం, మా తోటి ఉద్యోగస్తులను మా కుటుంబ సభ్యుల లాగ చూడడం ద్వారా మేమంతా సహానుభూతిని మా జీవితాలకి అన్వయించుకున్నాం. దోహా బ్యాంకు కుటుంబంలో ఒక భాగంగా ఉండడానికి నేను గర్వపడుతున్నాను.

## నైపుణ్యాల మెరుగుదల



చిన్నప్పటి నుంచీ బాగా చదువుకోవాలనీ, ఉన్నత స్థాయికి ఎదగాలనీ కోరిక ఉండేది మానవుడిగా పుట్టినవాడు అంకిత భావంతో, నిజాయితీగా పని చేస్తూ తన సహజమైన శక్తిని పెంపొందించుకోవడమే ముఖ్యమైన కర్తవ్యమని నమ్ముతాను నేను. జీవితంలో పైకి రావాలంటే, అన్ని కోణాల్లోనూ ఎదిగి ఉండాలి. నాకు నటనా రంగంలో సహజంగా ఉన్న ఆసక్తి వల్లా, అలాగే, నాకు నేనుగా నిలదొక్కుకోవడం అవసరం కావడం వల్లా, నేను చదువుతో బాటుగా రంగస్థల నటుడిగా కూడా పని చేయడం మొదలు పెట్టాను. నాటక సమాజంలో నటుడిగా పని చేస్తున్నప్పుడు వచ్చిన ఆదాయంతోనే నేను మా ఇంటికి ౧ గ్రైండరు కొన్నాను. మా కుటుంబానికి కావలసిన అలాంటి బహుమతులు తీసుకుని వెళ్లడం నాకు చాలా ప్రేరణనిచ్చేది. నేను విజయం సాధించాననే భావన కలిగించేవవి. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ప్రతి విద్యార్థీ చదువుతోబాటు మిగతా విషయాల్లో కూడా నైపుణ్యాలు పెంచుకునేందుకు తప్పక ప్రయత్నించాలి. మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు క్విజ్, వక్తృత్వం, సంగీతం, ఫైన్ ఆర్ట్స్ వంటి రంగాలు, నాటక సమాజాల్లో పని చేయడం వంటివి ఎంతో సహాయం చేస్తాయి. అవి మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. మన అనుసంధాన నైపుణ్యాన్ని మరింత తీర్చిదిద్దుతాయి. మన చుట్టూ ఉన్న పనులన్నింటిలోనూ క్రియాశీలకంగా నిమగ్నమవడం కావడం వల్లనే మనం ఆలోచించడం, ప్రతిస్పందించడం, పునరాలోచించుకోవడం అనే సామర్థ్యాలను పెంపొందించుకోగలుగుతాము.

ఇప్పుడు కూడా నేను వీలైనంత వరకూ నేర్చుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటాను. నేను ఈ రోజు ఫైనాన్షియల్ మీడియాలోనూ, కార్పొరేట్ ప్రదర్శనల్లోనూ  నా అభిప్రాయాలు కమ్యూనికేట్ చేయగలుగుతున్నానంటే, విశదీకరించి తర్కబద్ధంగా నా మాటను చెప్పగలుగుతున్నానంటే, నేను గతంలో చురుగ్గా పాల్గొన్న ఆ నాటక పాత్రలే. ఒక వ్యక్తి సాధించే గుణాత్మకమైన వ్యక్తిగత అభివృద్ధి పరిధి చాలా విస్తృతమని తెలుసు కాబట్టే,  దోహా బ్యాంకులో, మా ఉద్యోగస్తులను మరిన్ని నైపుణ్యాలను సంపాదించుకోవలసిందిగా మేం నిరంతరం ప్రోత్సహిస్తున్నాం.

## అప్పు ఎలా ఇవ్వాలి -  నేర్చుకున్న పాఠం



నేను చేసిన నిరంతర కృషి వల్లా, అంకిత భావం వల్లా, నేను స్కూల్లోనూ, కాలేజీలోనూ కూడా అందరి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాను. చిన్న చిన్న బహుమతులు రావడం సర్వసాధారణమైపోయింది. అలాంటి సందర్భంలో నాకు ఒకేసారి ౪౦౦ రూపాయల నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్ రావడం అంటే చాలా సంతోషమనిపించింది. సరిగ్గా అప్పుడే నా స్నేహితుల్లో ఒకతడికి అత్యవసరంగా కొంచెం డబ్బు కావలసి వచ్చింది. అతడు చాలా నిరాశలో మునిగిపోయి ఉన్నాయి.  నాలో తిరిగి అదే సహానుభూతి మేల్కొంది. అతడికి డబ్బు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాను. కానీ, నా స్నేహితుడు నేనిచ్చిన డబ్బు తీసుకుని, ఇంట్లోంచి పారిపోయాడు. నేను వాళ్ల నాన్నగారిని కలిసినప్పుడు, 'నీకు నీ స్నేహితుడి గురించి బాగా తెలుసా? అతడి నేపథ్యం గురించి కొద్దిగా అయినా తెలుసా?' అని అడిగారాయన. అతడికి డబ్బు అప్పుగా ఇచ్చినపుడు దానికి బదులుగా నేనేమైనా సెక్యూరిటీ పెట్టుకున్నానా అనీ, కనీసం నిర్ణయం తీసుకునే ముందు అన్ని కోణాలూ సరిగ్గా ఆలోచించావా అని కూడా ఆయన అడిగారు.  అప్పుడే నేను అప్పు ఇవ్వడం అనేది మౌలికంగా, అవతలి వ్యక్తి యొక్క వ్యక్తిత్వం, సామర్థ్యం,  అతడికి సహకార గ్యారంటీ ఇచ్చేవారు ఎవరైనా ఉండాలనీ గుర్తించాను.

సరే, ఇప్పుడైతే, పరస్పర ఒప్పందం కూడా చాలా అవసరమని అర్థమైంది! ఒక బ్యాంకు ఉద్యోగిగా సంక్షోభ పరిస్థితులు తలెత్తిన సందర్భంలో కఠోరమైన నిర్ణయాలు తీసుకోవడానికి నాకు ఆ పాఠం ఎంతో ఉపయోగపడింది...!  ఎన్నో అంశాల పునర్నిర్మాణంలో, నేను జీవిత గమనంలో వివిధ సందర్భాలలో నేర్చుకున్న మౌలికాంశాలను అమలు చేస్తున్నానో లేదోనని నాకు నేనే నిర్ధారించుకునేవాడిని. ***మనం ఏ వంతెన దాటాలీ, ఏ వంతెన దాటకూడదూ అనే విషయం నిశితంగా నేర్చుకోవడమే జీవితంలో అత్యంత కష్ట సాధ్యమైన పని.***

## బృంద నాయకత్వం



ఒక బృందం అంటే కొందరు మనుష్యుల సమూహం మాత్రమే కాదు, అంత కంటే ఎంతో ఎక్కువ. బృందంలో లావాదేవీలు ఉంటాయి. ఆ సమూహం చేసే ప్రయత్నంలో వ్యక్తిగా ఎవరికి వారు చూపే అంకిత భావం ఉంది.  అదే ఒక బృందం చేసే పని, ఒక కంపెనీ పని, ఒక సమాజం చేసే పని, ఒక నాగరికత చేసే పనిని  నిర్ధారించే అంశం అవుతుంది.  విభిన్న తరహాకి చెందిన వ్యక్తులు ఒక ఇంట్లో కలిసి మెలుగుతున్న వ్యవస్థ కుటుంబం. లింగ భేదంతోనూ, వయో భేదాలతోనూ ఉండే ఆ వ్యవస్థలో అనుభవజ్ఞులు ఉంటారు, అంతగా అనుభవం లేని వారూ ఉంటారు. కానీ మొత్తంగా మనం ఆ కుటుంబాన్ని ఏక మొత్తంగా పరిగణిస్తాం.  బృంద నాయకత్వంలో ఉండే ఈ విధమైన ఏకత్వ భావనే కార్పొరేట్ ప్రపంచపు పునాదిగా నిలుస్తుంది. భావి కాలంలో పటిష్టమైన విస్తరణకు దారి తీస్తుంది,

సిబ్బందిలో పరస్పర అవగాహన, బృందంలో పని చేసే వ్యక్తుల వ్యక్తిగత బలాలు, బలహీనతలూ అందరికీ తెలిసి ఉంటే, లక్ష్యాలను మరింత మెరుగైన రీతిలో సాధించేందుకు వీలు కల్పిస్తుంది. కార్పొరేట్ ప్రపంచంలో కూడా మనం అలానే కొన్ని సాధారణ అంచనాలు వేసుకుంటాం. ఒక కుటుంబంగా ఎంచుకుని, ఆ బృందం యొక్క శక్తి సామర్థ్యాలను బాగా మెరుగుపరచడానికి ప్రయత్నిస్తాం. సరైన పాఠాలు నేర్చుకుంటాం. హెన్రీ ఫోర్డ్ చెప్పిన మాటలు ఈ సందర్భానికి ఎంతైనా సరిపోతాయి : ''అందరూ కలిసి రావడం ఆరంభం. కలిసి మెలగడం అభివృద్ధి. కలిసి పనిచేయడం విజయం.''

# కుటుంబం, సమాజం పట్ల నిబద్ధత



ఒక గొప్ప మాట ఉంది : ***"ప్రతి ఒకటీ ప్రతి దానితోనూ అనుసంధానించబడి ఉంది,"*** అని. ఇది పర్యావరణ సూత్రాలలో తరుచుగా ఇది మొదటి నియమంగా చెప్తారు. ౨౧ వ శతాబ్దంలో మానవ సమాజ అభివృద్ధికి సహాయపడడానికి, ముందుగా మన భౌతిక వాతావరణంలో జీవించి ఉన్న వారి ప్రాధాన్యతను గుర్తించడం, వారితో గౌరవంగా, సమత్వ భావనతో వ్యవహరించడం అవసరం. నా జీవితంలోని తొలి సంవత్సరాలలో నేను ఎదుర్కొన్న సవాళ్లు నన్ను నేను మంచి మనిషిగా మలుచుకునేందుకు దోహదం చేశాయి. ఆర్థికంగా మేం పేదవారమే గానీ మేం చాలా సంతోషంగా ఉండేవారం. మా కుటుంబంలో ఒకరినొకరం పరస్పర ప్రేమాభిమానాలతో, అనురాగంగా ఉండేవాళ్లం. నేను నా స్వంత కుటుంబంతో వ్యవహరించే సమయంలోనైనా, మొత్తం సమాజంతో వ్యవహరించాల్సి వచ్చిన సందర్భంలోనైనా ఈ దృక్కోణాన్ని నేను తప్పకుండా చొప్పిస్తాను. కలిసి పనిచేయడం, తోటి మానవుల సౌభాగ్యం కోసం పని చేయడం నా మనసుకు ఎంతో సంతృప్తినిచ్చే విషయం. నేను కార్పొరేట్ నిచ్చెన ఎక్కడం మొదలుపెట్టగానే, నా కుటుంబం ఆర్థిక సమస్యల నుంచి బయట పడేలా చూశాను. అలాగే సమాజానికి తిరిగి ఇవ్వడమనే అంశం, ఎలాంటి బాగుకీ నోచుకోని జనానికి కొంత సహాయకరంగా ఉండడమే కాక, అది, వ్యక్తిగతంగా వారిని కూడా అభివృద్ధి పథంలోకి నడిపిస్తుందని నేను గుర్తించాను. నిలకడగా కొనసాగే అభివృద్ధి, దీర్ఘకాలిక విజయానికి తిరుగులేని వ్యూహమని నేనెప్పుడూ నమ్ముతాను.

గ్రీన్ బ్యాంకింగ్, గ్లోబల్ వార్మింగ్ కి ప్రతిగా చేపట్టబడుతున్న చొరవ, ఇంకా ప్రతికూల వాతావరణ మార్పులకు సంబంధించి, దోహ్ బ్యాంకు చూపుతున్న చొరవ చర్యలను చూస్తే, నిలకడైన అభివృద్ధిని సాధిస్తూ, ఇలాంటి సమున్నత లక్ష్యాలను సాధించే ప్రయత్నం జరిగిందని అనిపిస్తోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కేవలం మాటలకే పరిమితం కాదని నేనెప్పుడూ విశ్వసిస్తాను. సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులుగా, మనలో ప్రతి ఒక్కరం, మనం ఉద్యోగం చేస్తున్న ప్రతి సంస్థ తమదైన ఒక విజన్, ఒక మహత్తర లక్ష్యం కలిగి ఉండాలనీ, నేను భావిస్తాను. సమాజం పట్ల, ఆర్థిక వ్యవస్థ పట్ల ఉండే ఈ నిబద్ధతే భవిష్యత్తులో మన విజయానికి పునాది రాళ్లుగా రూపాంతరం చెందుతాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యతను స్వీకరిస్తూ, మేం ఈ ప్రపంచ వ్యాప్త మానవాళి అభివృద్ధికీ, అలాగే సకల మానవాళి సంక్షేమం కోసం పని చేసే సమాజాభివృద్ధికీ ప్రభావవంతమైన చర్యలు చేపడతాం.

చివరగా ఒక మాట ! నా చిన్నతనంలో నేను తీసుకున్న సవాళ్లు నన్ను నేను మలుచుకోవడానికి సహాయకోవడానికి సహాయం చేశాయి. అనుకున్న పనిని ఏనాడూ మధ్యలో వదిలిపెట్టకపోవడం, ఆ పని సాధించడానికి కనీసం నూటికి నూరుపాళ్లూ నాకు సంతృప్తికరమైన ప్రయత్నం చేయడమే తప్ప, ప్రయత్నమే చేయకుండా ఏ పనినీ నిర్లక్ష్యంగా వదిలేయలేదు. ఈ విధమైన జీవన దృక్పథమే నన్ను ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో గొప్ప నిశ్చయంతో ముందుకుసాగేలా చేసింది. ఇప్పుడు నేనొకసారి నా గతంలోకి తొంగి చూసుకుంటే, అమృతంలాంటి మధురానుభవాలైనా, విషగుళికల్లాంటి చేదు అనుభవాలైనా, నా జీవితానుభవాలే నన్ను ఈ రోజు మీ ముందు నిలబెట్టాయి. ఇంకా ముందుకు సాగబోయే నా ప్రయాణానికి కూడా అవే తోడుగా నిలుస్తాయని చెప్పాలి. ఇక్కడున్న ప్రతి ఒక్కరూ జీవితాన్ని ధైర్యంగా, సవాలుగా తీసుకొని, దృఢ నిశ్చయంతో ముందుకు కొనసాగాలనీ, సాహసంతో అలా ముందుకు సాగే జీవితాన్ని మనస్ఫూర్తిగా ఆనందిస్తారనీ ఆశిస్తూ, మీ అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. మన జీవన గమనం ఆ విధంగా ఉన్నప్పుడే మన వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితాల్లో అడుగడుగునా ఆనందం, విజయం మనల్ని వరిస్తాయి. ఆ విధంగానే మనం సమర్థవంతులమవుతాం. వాస్తవమైన నిరంతరాభివృద్ధి, ప్రగతీ లేకుండా, 'అభివృద్ధి', 'సాధన', 'ప్రగతి', 'విజయం' వంటి పదాలు అర్థరహితమనిపిస్తాయి. కాబట్టి, ఎదగడమే లక్ష్యంగా పెట్టుకోండి, అభివృద్ధి చెందడానికి, ప్రగతి పథంలో సాగడానికీ నిశ్చయించుకోండి. అప్పుడు తప్పక విజయం మీదే. విజయం సాధించడమంటే, నువ్వెంత డబ్బు సంపాదించావన్నది ముఖ్యం కాదని గుర్తుపెట్టుకోండి. విజయం సాధించడం అంటే, నువ్వు జనంతో ఎంత మమేకమై ఉంటున్నావు, నువ్వు ఎలాంటి సంబంధ బాంధవ్యాలను నిర్వహిస్తున్నావు, నీ జీవితంలో నీ బృందంతో, నీ భాగస్వామ్యంతో నీకెంత అనుబంధం ఉందన్న అంశం మీద ఆధారపడి ఉంటుందని అర్థం చేసుకోండి. అందరినీ సహకరించడానికి ప్రేరణ కల్పించండి, నైపుణ్యం, సామర్థ్యం, నాయకత్వ బాధ్యతలను అందరిలోనూ పెంచండి. జీవితంలో ప్రతి క్షణం నుంచీ మనకొక పాఠం వస్తోంది, శ్రద్ధగా నేర్చుకోండి. వ్యక్తిగా గొప్ప విలువలు కలిగి ఉంటూ, ఆ విలువలు అందించే విజయాన్ని సగర్వంగా అందుకోండి !

"ప్రపంచంలోని మతాలన్నీ
మిగతా దృక్కోణాల్లో విభేదించవచ్చునేమోగానీ,
ఈ ప్రపంచంలో సత్యమే నిలిచి ఉంటుందనే అంశాన్ని మాత్రం ముక్త
కంఠంతో ఎలుగెత్తి చాటుతున్నాయి."
---మహాత్మా గాంధీ

